సాక్షి
అన్నమయ్య జిల్లా

ఆదివారం । 19 । ఫిబ్రవరి । 2023



రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలక వర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్!

నందలూరు రైల్వేకేంద్రంలో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ పడింది. - 8లో



ఆదర్శ సమాజ నిర్మాణమే ఇస్లాం ధ్యేయం

ఆదర్శ సమాజ నిర్మాణమే ఇస్లాం ధ్యేయమని ముస్లిం ఉలేమాలు, ధార్మిక గురువులు పేర్కొన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.280
రెండోరకం	రూ.100	రూ.186



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 170 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	550	675
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 638.70 కిలోలు

హర హర మహాదేవ

- జిల్లాలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
- ఎక్కడ చూసినా భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు
- రాజంపేట సమీపంలోని అత్తిరాల, మల్లెంకొండ, గుండాలకోన, నిత్యపూజకోనలకు పోటెత్తిన జనం
- శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడిపిన ఆర్టీసీ
- భక్తులకు అసౌకర్యాలు తలెత్తకుండా పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు




రాజంపేట రూరల్: త్రేతేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న త్రేతేశ్వరస్వామి

సాక్షి రాయచోటి : మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఎక్కడ చూసినా భక్తులు తండోపతండాలుగా ఆలయాల వద్ద కనిపించారు. శనివారం తెల్లవారుజాము నుంచే శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. అన్నమయ్య జిల్లాలో అడుగడుగునా స్వామి వారిని స్మరించుకుంటూ శైవ క్షేత్రాలకు అడుగులు వేశారు. ప్రత్యేక వాహనాల్లో కొందరు, ఆర్టీసీ బస్సుల్లో మరికొందరు...ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలో శివాలయాలకు తరలి వెళ్లారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలన్నీ విద్యుత్ శోభను సంతరించుకున్నాయి. ప్రతి ఆలయం వద్ద భక్తులు క్యూలైన్లలో ఉండి శివపార్వతులను దర్శించుకున్నారు.

భక్తులతో పోటెత్తిన శివాలయాలు: రాయచోటిలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో ఉన్న అఘోర లింగేశ్వరస్వామి ఆలయంతోపాటు పాత రాయచోటిలోని త్రేతేశ్వరస్వామి ఆలయం, మదనపల్లెరోడ్డులోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, కొత్తపేట శివాలయంతోపాటు పలు శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. తంబళ్లపల్లె పరిధిలోని మల్లెంకొండ శివాలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి మల్లికార్జునస్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ఆహారాన్ని అందించారు. సిద్దవటం మండలంలోని నిత్యపూజస్వామికోన ఇసుక వేస్తే రాలనంత జనంతో కిక్కిరిసిపోయింది. ఎక్కడ చూసినా కొండకోనలు, చెట్ల మధ్య భక్తులే కనిపించారు. రాజంపేట మండలంలోని అత్తిరాల త్రేతేశ్వరస్వామి ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే రైల్వేకోడూరు పరిధిలోని గుండాల కోన నీలకంఠేశ్వరుడిని కూడా భక్తులు దర్శించుకున్నారు. గుండాలలో మునిగి పాపాలు తొలగిపోవాలని భక్తులు వేడుకున్నారు. అలాగే మదనపల్లె యోగా భోగేశ్వరస్వామి, సోమేశ్వరస్వామి, నిమ్మనపల్లె పరిధిలోని తవళం నేల మల్లేశ్వరస్వామి, రామసముద్రం మండలంలోని పాలీశ్వరస్వామి కొండ భక్తులతో కిటకిటలాడాయి. అంతేకాకుండా పీలేరు పరిధిలోని గుండాల మల్లేశ్వరస్వామి, పీలేరు శివాలయాలు కూడా భక్తులతో పోటెత్తాయి. ఎక్కడ చూసినా ఆలయాల వద్ద శివనామ స్మరణ కనిపించింది.

ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్

జిల్లాలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ప్రజాప్రతినిధులు శివాలయాలకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి హసనాపురం పరిధిలోని శివాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే తంబళ్లపల్లె పరిధిలోని మల్లెంకొండ ఆలయానికి కాలినడకన కొండపైకి వెళ్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజంపేట పరిధిలోని అత్తిరాల, రైల్వేకోడూరు పరిధిలోని శివాలయంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి పూజలు చేశారు.

శివాలయాలకు ప్రత్యేక బస్సులు

అన్నమయ్య జిల్లాలోని శివాలయాలకు ఆర్టీసీ సంస్థ శని, ఆదివారాల్లో ప్రత్యేక సర్వీసులను నడిపింది. ఎక్కడికక్కడ శివాలయాలకు వెళ్లే వారికి సౌకర్యంగా 100కు పైగా ప్రత్యేక సర్వీసులను నడిపారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టారు.

పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు

మహాశివరాత్రి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు బందోబస్తును పర్యవేక్షించారు. అన్ని శివాలయాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించడంతోపాటు దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవడం, భక్తులు ఎక్కడా తోపులాటకు గురికాకుండా తగిన చర్యలు చేపట్టారు. అలాగే శైవ క్షేత్రాల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సంబేపల్లె మండలంలోని మోటకట్ల శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.




సిద్దవటం: నిత్యపూజ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, ప్రత్యేక అలంకరణలో నిత్యపూజస్వామి



తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై ప్రత్యేక అలంకరణలో మల్లికార్జునస్వామి



శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అఘోరలింగేశ్వరుడు



రాయచోటిటౌన్: పురుష మృగ వాహనంపై ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

పీలేరు రూరల్ : పేకాట ఆడుతున్న 22 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. వివరాలిలా.. శనివారం మండలంలోని బోడుమల్లువారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 22 మంది నిందితులను అరెస్ట్ చేసి రూ. 3,02,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసి నగదు అపహరణ

మదనపల్లె : ఓ వ్యక్తిపై దాడి చేసి నగదు అపహరించుకుని వెళ్లిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... పులికల్లు పంచాయతీ గుడ్డంవారిపల్లెకు చెందిన సుధాకర్ (35) భూమిని విక్రయించగా రూ. 3 లక్షలు వచ్చింది. తన వద్ద ఉన్న నగదులో నుంచి రూ.2లక్షలు ఇంట్లో ఉంచి, మరో లక్ష తీసుకుని పీటీఎంలో పైపులు కొనుగోలు చేసేందుకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన వెంకటరమణ, బాధితుడు సుధాకర్‌పై దాడి చేసి నగదు తీసుకుని ఉడాయించాడు. దాడిలో తీవ్రంగా గాయపడిన సుధాకర్‌ను కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పీటీఎం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియల అడ్డగింత

ములకలచెరువు: ఆస్తి కోసం భర్త అంత్యక్రియలను భార్య అడ్డుకున్న సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... మండలంలోని పర్తికోటకు చెందిన విజయ్‌కుమార్(54) ఒంటరితనం భరించలేక శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఇతని భార్య రామలక్ష్మమ్మ పుట్టింటికి వెళ్లింది.వీరికి పిల్లలు లేరు. విజయ్‌కుమార్ తల్లి వసంతమ్మ,చెల్లెలు విజయమ్మతో కలిసి ఉంటున్నాడు. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా రామలక్ష్మమ్మ అక్కడికి వచ్చింది.ఆస్తి ఇవ్వాలంటూ గొడవ చేసింది. తన ప్రాణం ఉన్నంత వరకు ఆస్తి ఎవ్వరికీ ఇవ్వనని వసంతమ్మ చెప్పింది.పోలీసులు జోక్యం చేసుకోవడంతో రామలక్ష్మ అక్కడి నుంచి వెళ్లిపోయింది. విజయకుమార్ మృతదేహానికి అంత్యక్రియలు జరిపించారు.

ఆదర్శ సమాజ నిర్మాణమే ఇస్లాం ధ్యేయం

- ప్రవక్త బోధనలు అనుసరణీయం
- మదనపల్లెలో ప్రారంభమైన 'ఇజ్తిమా' ధార్మిక సదస్సు
- వేలాది మంది ముస్లింలు హాజరు



ఇజ్తిమాలో సామూహికంగా నమాజ్ చేస్తున్న ముస్లింలు

మదనపల్లె సిటీ: ఆదర్శ సమాజ నిర్మాణమే ఇస్లాం ధ్యేయమని ముస్లిం ఉలేమాలు, ధార్మిక గురువులు పేర్కొన్నారు. శనివారం మదనపల్లె పట్టణం కదిరిరోడ్డులోని టీపూ సుల్తాన్ వక్ఫ్‌మైదానంలో రెండు రోజుల ధార్మిక సదస్సు ఇజ్తిమా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ధార్మిక గురువులు మౌలానా మసీవుల్లా, మౌలానా అక్బర్‌షరీఫ్, ముఫ్తీ అస్లాంసాహెబ్, హాజీ ఫారూఖ్ అమీర్ సాహెబ్‌లు ధార్మికోపన్యాసం చేస్తూ మహాప్రవక్త హజరత్ మహమ్మద్ సూచించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఇస్లాం సూచించిన ఐదు సూత్రాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. దైవం ఒక్కటేనని విశ్వసించడం, ప్రతి రోజు ఐదు సార్లు నమాజ్ చేయడం, రంజాన్ మాసంలో 30 రోజుల పాటు ఉపవాసదీక్షలు చేపట్టడం, జకాత్ రూపంలో పేదలకు దాన,ధర్మాలు చేయడం, ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ఒక్కరూ జీవితంలో ఒకసారైనా మక్కా మదీనా పుణ్యక్షేత్రాలను సందర్శించడం ఇస్లాం మూలసూత్రాలన్నారు. మానవాళి సంక్షేమం, శాంతియుత, దైవభక్తితో కూడిన జీవన విధానం బోధించడమే ఇజ్తిమా లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ దైవభక్తి, పాపభీతి కలిగి ఉండాలన్నారు. పేదలను ఆదుకోవాలని, కష్ట,సుఖాలలో ఒకరికొకరు సహాయపడాలని ఉలేమాలు ఈ సందర్భంగా సూచించారు. ఇజ్తిమాకు అన్నమయ్య, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల నుంచి వేలాది మంది ముస్లింలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతి నమాజ్ అనంతరం విశ్వశాంతి కోసం, విపత్తుల నుండి దేశాన్ని కాపాడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'ఇజ్తిమాకు ప్రత్యేక ఏర్పాట్లు

స్థానిక టీపూ సుల్తాన్ వక్ఫ్ మైదానంలో ప్రారంభమైన ఇజ్తిమాకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన ముస్లింల కోసం అనేక చోట్ల ఉచితంగా ఆహార, పానీయ కేంద్రాలను ఏర్పాటు చేశారరు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ముస్లిం యువత తగు ఏర్పాట్లు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

నందలూరు(రాజంపేట): ఒడిస్సా రాష్ట్రంలోని బేలేశ్వర్ జిల్లా జ్యూలేశ్వర్ మండలానికి చెందిన యువకుడు బిజ్జి విజయకుమార్ (13) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని ఏఎస్ఐ శంకర్‌నాయక్ పరిశీలించారు. ఎస్ఐ కథనంమేరకు వివరాలిలా.. విజయకుమార్ తల్లి మృతి చెందింది. నాన్న వేరే పెళ్లి చేసుకొని వెళ్లిపోయాడు. దీంతో అక్క, బావ జీవనోపాధి కోసం నందలూరు బస్టాండులో ఉన్న మల్లికార్జున హోటల్ పనిచేసేందుకు పంపించారు. బైకు తోలడం ఇతనికి హాబీ. హోటల్ యజమాని బైకు తీసుకొని వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత బైకు తీసుకెళ్లడంపై ప్రశ్నించారు. దీంతో మనస్తాపానికి గురై రేకులషెడ్డు పైపునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యజమాని రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్!

- అభ్యర్థుల ఎంపికకు నేతల కసరత్తు
- 20 నుంచి నామినేషన్లు, 2న పోలింగ్



నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలో కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ పడింది.ఈ మేరకు గుంతకల్ రైల్వే డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ మేనేజరు జీఎస్ చౌహన్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు.పాలకవర్గంలో ఎన్నికలు జరిగే పదవులను వెల్లడించారు. సెక్రటరీ, జాయింట్‌సెక్రటరీ, కోశాధికారి, ఆరుగురు కమిటీ సభ్యుల పదవులకు అభ్యర్థులు పోటీపడున్నారు.

ఆంగ్లో ఇండియన్స్ నుంచి రైల్వే ఇన్‌స్టిట్యూట్ సంస్కృతి ఆవిర్భావం

బ్రిటీషు రైల్వేపాలకుల హయాం నుంచి నందలూరు రైల్వే ఇన్‌స్టిట్యూట్ వైభవంగా వెలుగొందింది. ఆంగ్లో ఇండియన్‌కు చెందిన డాయల్‌దొర, హోప్రిన్‌దొర, మరికొన్ని కుటుంబాలు, వందలాది కార్మికులు సభ్యులుగా కొనసాగారు. స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఉన్నప్పటి నుంచి వివిధ విభాగాలకు చెందిన కార్మికులు, వారి కుటుంబాల కోసం రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను 1920లో ఏర్పాటు చేశారు.శారీరక, మానసిక, విజ్ఞాన, క్రీడ, కళారంగానికి సంబంధించి అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూవచ్చారు.కళాసమితి తరఫున రాష్ట్రస్థాయిలో నాటకాలు, రంగస్థలం పోటీలు నిర్వహించేవారు.చాలా మంది సినీనటులు ఇక్కడికి వచ్చిన దాఖాలాలు ఉన్నాయి. హౌసీగేమ్ కోసం చెన్నై నుంచి హిగ్గిన్‌బోథమ్స్ పరికరాలు, నంబరుబోర్డు, నంబరు కాయిన్స్ గేమ్ నిర్వహణకు ఆదరణ ఉండేది. అలాగే రైల్వే టెన్నిస్‌కోర్టును వేదికగా చేసుకొని మాజీ ప్రధాని ఇంధిరాగాంధీ ప్రసంగాన్ని ఇప్పటికి పూర్వీకులు గుర్తుచేసుకుంటున్నారు.

ఈనెల 20 నుంచి రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఏర్పాటు కోసం నామినేషన్లను ఆహ్వానించనున్నారు. వచ్చేనెల 2న పోలింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 8 నుంచి సభ్యుల జాబితా.. 13 వరకు పరిశీలన, చేర్పులు , మార్పులు జరిగాయి. 15న సభ్యుల తుది జాబితాను సిద్ధం చేశారు. 15 నుంచి 20 వరకు నామినేషన్ ఫారాలను విడుదల చేశారు. ఈనెల 21న పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటించనున్నారు. 23న ఉపసంహరణ,24న నామినేషన్లను గుర్తించి, గుర్తులను ప్రకటించనున్నారు.పోలింగ్‌రోజునే కౌంటింగ్ నిర్వహించేలా రైల్వేశాఖ సన్నాహాలు చేస్తోంది.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గం ఎన్నికల్లో సౌత్ సెంట్రల్‌మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘాలు పోటాపోటీపడుతున్నాయి. దీంతో అభ్యర్థుల ఎంపికకు నేతలు కసరత్తు చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నందలూరులో రైల్వే ఎన్నికల వేడి రాజుకుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

చిట్వేలి: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, వసతి గృహాల్లో వారికి అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా వార్డెన్లు కృషి చేయాలని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక కేంద్రీకృత వసతి గృహాన్ని డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో సౌకర్యాలు, చదువుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఏ-1, ఎఫ్ఏ పరీక్షల్లో వచ్చిన మార్కుల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదవాలని, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. అనంతరం పాత చిట్వేలిలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని డీఈఓ సందర్శించారు. ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డన్లు తిరుపతిరెడ్డి, కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు హరినాథ్, దుర్గరాజు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, ఖాలేషాలు పాల్గొన్నారు.

జీవితంలో యవ్వనప్రాయం ముఖ్యమైనది



అంగళ్లు చర్చిలో సందేశం విన్పిస్తున్న శ్రీహరికోట మాజీ సైంటిస్టు వరప్రసాద్

కురబలకోట : మనిషి జీవితంలో యవ్వన ప్రాయం ముఖ్యమైనదని, దేవుని యందు భయభక్తులతో ముందుకు సాగాలని శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం మాజీ జనరల్ మేనేజర్, సైంటిస్టు ఆర్. వర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం అంగళ్లు సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన యవ్వనస్తుల కూడికలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ యవ్వన దశలో శారీరకంగా మానసికంగా మార్పులు వస్తాయన్నారు. అందం, ఆకర్షనకు సులభంగా పడిపోతారన్నారు. వ్యసనాలు జీవితాన్ని దారితప్పిస్తాయన్నారు. అందుకే బాధ్యతాయుతంగా ప్రవర్తించాలన్నారు. క్రీస్తు మార్గం ద్వారా సుఖం, నెమ్మది, సమాధానం లభిస్తుందన్నారు. బైబిల్ దారి చూపే దీపమన్నారు. వాక్యం వెలుగులో ఎవరికి వారు సంస్కరించుకోవాలన్నారు. యవ్వన ప్రాయంలో దురలవాట్లుకు దూరంగా ఉంటూ గమ్యం గురి, దిశానిర్దేశం చేసుకుని ముందుకు సాగాలన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

మదనపల్లె: వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. సోమల మండలం కందుకూరుకు చెందిన శశికళ(19) శనివారం ఉదయం తన భర్త రాజుతో ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు బంధువుల ఇంటికి బయలుదేరారు. చంద్రకాలనీ సమీపంలో రహదారిపై ఉన్న గుంతలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడ్డారు. ఈ ప్రమాదంలో శశికళ తీవ్రంగా గాయపడింది. కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు తాలూకా, కురిగేపల్లెకు చెందిన అశోక్(20) శనివారం మదనపల్లె మండలం ఎనుమలవారిపల్లెలో ఉన్న అమ్మమ్మ రాణెమ్మ వద్దకు వస్తుండగా చీకలబైలు వద్ద కుక్క అడ్డురావడంతో ద్విచక్రవాహనం నుంచి అదుపుతప్పి పడింది. స్థానికులు ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె మండలం వైఎస్సార్ కాలనీకి చెందిన వెంకటరమణ (63) శుక్రవారం రాత్రి వలసపల్లె పంచాయతీ నవోదయ పాఠశాల వద్ద రహదారిపై నడుచుకుని వెళ్లుండగా కాటపల్లెకు చెందిన రెడ్డిప్రకాష్ ద్విచక్రవాహనంతో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి తాళలేక వ్యక్తి ఆత్మహత్య

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పులికల్లు పంచాయతీ చిన్న వెంకట్రమణగారిపల్లి (సీవీ పల్లి)లో ఎం.విశ్వనాథ్ (43) అనే వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కడుపునొప్పి తాళలేక జీవితంపై విరక్తి చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి భార్య రాజేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆటోను ఢీకొన్న కారు



తీవ్రంగా గాయపడిన మహిళను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, తదితరులు

వేంపల్లె : వేంపల్లె పట్టణ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న సంచుల ఫ్యాక్టరీ వద్ద ఆటోను కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహా శివరాత్రిని పురస్కరించుకుని వేంపల్లె నుంచి వీరపునాయునిపల్లె మండలం అనిమెల గ్రామం వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయానికి 8 మంది ఆటోలో బయలుదేరారు. సంచుల ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే ప్రొద్దుటూరుకు చెందిన కారు వెనుకవైపు నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడి అందుల ప్రయాణిస్తున్న 8మంది మహిళలు ఒకరిపై ఒకరు పడ్డారు. అందులో లహరి, లక్ష్మిదేవి, రిషిత, సుబ్బలక్షుమ్మ, గంగాదేవిలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ బాషాకు స్వల్ప గాయాలయ్యాయి. మరో ఇద్దరికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులను స్థానికులు ప్రాథమిక చికిత్స కోసం వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. వీరిలో లహరి, రుషిత, సుబ్బలక్షుమ్మల పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి ఆసుపత్రికి వచ్చి వారిని పలకరించారు. ఆటోను ఢీకొట్టిన కారును వదిలేసి వెళ్లిపోయారు. కారును వేంపల్లె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

తెలుగుభాషాభివృద్ధిపై ఆశలు




డాక్టర్ తవ్వా వెంకటయ్యను సత్కరిస్తున్న స్థానిక స్వచ్ఛంద సంస్థలు

కడప కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అధికార భాషా సంఘానికి అధ్యక్షులు, సభ్యులను నియమించడంతో రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధిపై ఆశలు పెరుగుతున్నాయని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి డాక్టర్ వి.బ్రహ్మయ్య పేర్కొన్నారు. జిల్లాకు చెందిన యువ సాహితీవేత్త డాక్టర్ తవ్వా వెంకటయ్యను సభ్యునిగా నియమించడమే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్యల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో తవ్వా వెంకటయ్యకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగుభాషాభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. భాషకు ప్రాణం లాంటి సంస్కృతి సంప్రదాయాలు మరింత బలపడగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. సభాధ్యక్షుడు, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సులో పెద్ద పదవి రావడంతో వెంకటయ్య లాంటి నిత్య సాహితీ కృషీవలునికి తగిన గుర్తింపు లభించినట్లయిందన్నారు. ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. లయన్స్ క్లబ్ కడప నగర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, లయన్ పోతుల వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ ప్రతినెల జిల్లాలో తెలుగుభాషాభివృద్ధి కోసం పాఠశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి అధికారభాషా సంఘం విధి విధానాలను, బాధ్యతలను వివరిస్తూ వెంకటయ్య నియామకం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రొద్దుటూరు-1 సర్కిల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి,వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు, విద్యావేత్త పి.అక్బర్‌ఖాన్, వైవీయూ జర్నలిజం ఫ్యాకల్టీ డాక్టర్ సురేష్ మాట్లాడారు. అనంతరం కార్యనిర్వాహక సంస్థలు ఇతర సాహిత్య, కళా, వారసత్వ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డాక్టర్ తవ్వా వెంకటయ్యను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ జీవీ సాయిప్రసాద్, పసుపులేటి శంకర్, ఓం శాంతి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ తనను విద్య, భాషా, సాహిత్యవేత్తగా తీర్చిదిద్దిన వారందరికి, ముఖ్యంగా తనకు ఈ పదవి ఇచ్చిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

సాహితీ నగరి.. 'భూతపురి'

- నేడు మహాకవి డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ జయంతి



డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ (ఫైల్)

కడప కల్చరల్ : ఆయన మహా పండితుడు..అవధాని..జ్యోతిష్యశాస్త్రం, వాస్తుశాస్త్ర నిపుణులు. జిల్లాలో ఇతరులెవ్వరికీ దక్కని గండిపెండేర సత్కారం, గజారోహణ అభినందనం కూడా అందుకుని వైఎస్సార్ జిల్లాకు గర్వకారణంగా నిలిచిన సాహితీవేత్త. ఆయనే మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ. జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్న ఆయన 86వ జయంతిని ఆదివారం నిర్వహించనున్నారు. ఆయన పేరిట 21వ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. జిల్లాకు కవుల గడపగా పేరుంది. ప్రముఖులైన కవులెందరో జిల్లా పేరును ఇనుమడింపజేశారు. వారిలో నిన్నటితరం కవి సంస్కృతాంధ్ర సాహితీవేత్త, మహావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ ముందు వరుసలో ఉంటారు. ఆయన రాసిన శ్రీకృష్ణభారతం తెలుగు సాహితీ లోకంలో విశిష్ట స్థానం పొందింది. వారి కుమారులు ఆయన పేరిట స్మారక ట్రస్టు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఓ పండితునికి సాహిత్య పురస్కారాన్ని అందజేస్తున్నారు. అల్లసాని పెద్దన సాహితీపీఠంతో కలిసి ఏటా క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆయన పేరిట 21వ స్మారక అవార్డును ప్రముఖ సాహితీవేత్త ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు అందజేయనున్నారు.

కవి డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 1938 ఫిబ్రవరి 14న వల్లూరు సమీపంలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామంలో జన్మించారు. తండ్రి సుబ్బయ్యశర్మ మహాపండితులు. ఆయన నుంచి కుమారుడు సుబ్రమణ్యశర్మకు సాహిత్య వారసత్వం లభించింది. తండ్రి వద్దే సంస్కృతాంధ్రలను అవపోసన పట్టారు. డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన శ్రీరామభక్తుడు. తన రచనలన్నీ శ్రీరామునికే అంకితమిచ్చారు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష్యవిభాగానికి పుస్తకాలు రాయడంతోపాటు బోధన కూడా చేశారు. 1989లో డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల సమక్షంలో సువర్ణ గండపెండేర సత్కారం జరిగింది. 1997లో కడప నగరంలో గజారోహణం చేశారు. స్వర్ణ హస్త కంకణ సత్కారం స్వీకరించారు. ఉభయ కవి సార్వభౌమ బిరుదు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, పలు సాహితీ సంస్థల నుంచి ఎన్నో బిరుదులు పొందారు. ఆయన పేరిట కుమారుడు డాక్టర్ శివరామ సురేంద్రశర్మ, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రిలు స్మారక సంస్థను ఏర్పాటు చేసి యేటా ఆయన జయంతి నాడు సాహితీవేత్తకు పురస్కారం ప్రదానం చేస్తున్నారు.

డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ పేరిట 21వ సాహిత్య పురస్కారాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించనున్నారు. వైవీయూ వీసీ ముఖ్య అతిథిగా పాల్గొంటారు.

మల్లెంకొండలో రాజంపేట వాసి మృతి



విశ్వనాథ్ మృతదేహం

గోపవరం : శివరాత్రి పర్వదినం సందర్భంగా మల్లెంకొండేశ్వరస్వామిని దర్శించుకునేందుకు రాజంపేటకు చెందిన శంకరయ్య (60) శనివారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బంధువులతో కలిసి మల్లెంకొండేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కొండ ఎక్కుతుండగా జారుడు బండ సమీపంలో ఆయాసంగా ఉందని శంకరయ్య తోటి వారికి తెలియజేశాడు. అక్కడే కొద్దిసేపు కూర్చున్నాడు. బంధువులు డోలి సహాయంతో కొండ కిందకు తీసుకొచ్చారు.వైద్యాధికారి డాక్టర్ నర్మద వైద్యపరీక్షలు అందించేందుకు యత్నించగా అప్పటికే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ప్రైవేటు అంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని రాజంపేటకు తరలించారు.